నమస్తే తెలంగాణ
మెదక్
15 | హైదరాబాద్, బుధవారం 13 మార్చి 2024 | MEDAK


చేర్యాల మండలంలోని పెదరాజుపేటలో పశువులు మేయడంతో బోసిన పంట చేను

రైతన్నల.. జలఘోష

■ తలాపునే ప్రాజెక్టులు.., సాగుకు నీటి కరువు ■ జీవాలకు గ్రాసంగా మారిన పంటలు

అక్కన్నపేట మండలం అంతకపేటలో ఎండిన వరిచేనులో మేస్తున్న జీవాలు

తలాపునే ప్రాజెక్టులు ఉన్నా.. సాగు నీరు మాత్రం సున్నా..! కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పదేండ్లలో ఎన్నడూ లేని నీళ్ల కరువును రైతులు ఇప్పుడు కనులారా చూస్తున్నారు. ఓ వైపు భూగర్భ జలాలు అడుగంటిపోతుండగా, మరోవైపు కరెంటు 'కట్'కటతో ఇబ్బందులు నెలకొన్నాయి. పొలాల్లో ఎండిపోతున్న పైరు మూగజీవాలకు గ్రాసంగా మారుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పచ్చని పంటలు ఎండుగడ్డిని తలపిస్తున్న దృశ్యాలు కాంగ్రెస్ సర్కారు తెచ్చిన కరువుకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

గౌరవెల్లి ప్రాజెక్టుపై పట్టింపేది..?

- నీరందక ఎండుతున్న పొలాలు.. పొలమంతా జీవాల పాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ జర చూడండ్రి...

అక్కన్నపేట, మార్చి 12: కాంగ్రెస్ పాలనలో కరువు తాండవం చేస్తోంది. మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏ రైతును కదిలించినా కన్నీళ్లు ముచ్చటనే చెప్పుతున్నారు. అడుగంటిన భూగర్భ జలాలు, వచ్చిపోయే దొంగ కరెంటు, ఎండుతున్న పంట చేన్లతో రైతులు అరిగోస పడుతున్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం అంతకపేటకు చెందిన అల్లాడి సంపత్ ఆలియాస్ సోమ సంపత్ రెండు ఎకరాల్లో వరి సాగుచేశాడు. పొలమంతా నీళ్లందక ఎండిపోయింది. దీంతో గొర్రెల కాపరులు ఎండిన వరిచేన్లలో గొర్రెల మందలను మేపుతున్నారు. 1.06లక్షల ఎకరాలకు సాగునీరందించేలా అక్కన్నపేట మండలంలో కేసీఆర్ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. బీఆర్ఎస్ హయాంలో దాదాపు 95శాతం పనులు పూర్తిచేసి ప్రాజెక్టు ట్రయల్‌రన్ చేయగా విజయవంతమైంది. ప్రాజెక్టులో 1.5 టీఎంసీల గోదావరి జలాలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు తుదిదశ పనులపై దృష్టిసారిస్తే ప్రాజెక్టులోని నీళ్లు కాల్వల్లో పారేవి. పదేండ్ల నుంచి పచ్చగా ఉన్న పొలాలు ఎండిపోతూ ప్రస్తుతం బీడు భూములుగా మారుతున్నాయి. తలాపున పెద్ద ప్రాజెక్టు ఉన్నా లేనట్టుగానే అయిపోయింది. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మాత్రం ఈ ప్రాజెక్టుపై పట్టింపు లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఎటుచూసినా ఎండిన పొలాలే...

ఐదారేండ్లుగా నీళ్లకు గోసరాలేదు. ఎటూ చూసినా భూములు పచ్చగా కనబడేవి. జీవాలు మేసేందుకు జాగ కూడా దొరకకపోయేది. తుమ్మచెట్లు, గుట్టల పొంటి మేపేది. అవసరమైతే జీవాలతోని మన్యం పోయేది. అసోంటిది ఇప్పుడు ఎటుచూసినా ఎండిన పొలాలు కనిపిస్తున్నాయి. మాఊరే కాదు, చుట్టుపక్కల ఊళ్ల కూడా గిట్లనే ఉంది పరిస్థితి. నాకున్న ఎకరం పొలం ఎండిపోయింది. సుట్టపోళ్లకు ఫోన్ చేస్తే కూడా పొలాలు పారతలేవు అనేదే చెప్పుతుండ్రు. కాంగ్రెసోళ్లతోనే కరువు అచ్చినట్లు అయ్యింది. ఇరవై ఐదేండ్ల కిందట కాలం మళ్ల ఇప్పుడు యాదికి వస్తున్నది.
– సలేంద్ర బాలరాజు, గొర్రెల కాపరి, అంతకపేట(సిద్దిపేట జిల్లా)

దేవాదుల నీళ్లు రాక.. ఎండుతున్న పంటలు

పశువులకు మేతగా పొలాలను వదిలేస్తున్న రైతులు

చేర్యాల, మార్చి 12: చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో ఏటా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి అక్కడి నుంచి ఆయా గ్రామాల్లోని చెరువులు,కుంటలు నింపేవారు.దీంతో పంటలు ఎండిపోకుండా ఉండేవి. ప్రస్తుతం అందుకు భిన్నంగా కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తుండడంతో రైతుల సాగుచేసిన పంటలు ఎండిపోవడంతో మూగజీవాలకు వదిలిపెడుతున్నారు. దేవాదుల నీటిని విడుదల చేయకపోవడంతో చెరువులు, కాల్వలు ఎండిపోయి, జలాలు అడుగంటిపోతున్నాయి.బోరుబావులు వట్టిపోయి వరి,మొక్కజొన్న పంటలు ఎండిపోతుండడంతో రైతన్నలు దిగాలు చెందుతున్నారు.మండలంలోని పెదరాజుపేట గ్రామానికి చెందిన పిట్టల భాస్కర్ అనే రైతు రెండున్నర ఎకరాల పొలం మూగజీవాలకు పశుగ్రాసంగా మారింది. మండలంలోని ఆకునూరులో పలువురు రైతులు తమ పంటలను పశువులకు వదిలిపెట్టిన ఘటన మరువక ముందే పెదరాజుపేటలో సైతం కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ముమ్ముందు పరిస్థితులు ఏ విధంగా ఉంటాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో పంటల సాగు సైతం తగ్గిందని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. నీటి వనరులు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టింపు లేకుండా వ్యవహరించడంతో రైతుల పరిస్థితి దీనంగా తయారైంది.

జీరో కరెంటు బిల్లులకు మున్సిపల్‌లో బారులు

సంగారెడ్డి, మార్చి12: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఉచిత హామీల అమలుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 6 వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అభయహస్తం కార్యక్రమం ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. మంగళవారం వరకు ఉచిత కరెంటు బిల్లులు అందకపోవడంతో పట్టణవాసులు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లకు ప్రజలు బారులు తీరారు. ఉచిత కరెంటు బిల్లుకు నిబంధనలు పెట్టకపోయినా జీరో బిల్లులు రాకపోవడంతో ప్రజలు ఆందోళనతో కార్యాలయానికి పరుగులు పెట్టారు. ప్రభుత్వం అద్దె ఇండ్ల లో నివాసముంటున్న వారు కూడా అర్హులని ప్రకటించడంతో 200 యూనిట్లలోపు కరెంటు వాడుకునే వారు ఆధార్‌కార్డు, ఆహార భద్రతకార్డు, అద్దె ఇంటి కరెంటు బిల్లులతో మున్సిపల్ కార్యాలయంలో బారులుతీరారు. ఇప్పుడు రాకుంటే భవిష్యత్‌లో ఉచిత కరెంటు బిల్లులు రావేమోనని ఆందోళనతో ప్రజలు కార్యాలయానికి వచ్చారు.

ఉచిత కరెంటు బిల్లులకు బారులు తీరిన పట్టణ ప్రజలు

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తాం

రామాయంపేట విద్యుత్ ఏడీఈ సుధాకర్

రామాయంపేట రూరల్, మార్చి 12: వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని, భూగర్భ జలాలు తగ్గడంతోనే సమస్యలు వస్తున్నాయని రామాయంపేట ట్రాన్స్‌కో ఏడీఈ సుధాకర్ అన్నారు. సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'కరెంట్ ట్రిప్‌తో కాలుతున్న మోటర్లు'.. అనే శీర్షికకు స్పందించిన విద్యుత్ అధికారులు మంగళవారం రామాయంపేట మండలం కోనాపూర్ గిరిజన పెద్ద తండాను సందర్శించారు. గిరిజన రైతుల పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు గిరిజన రైతులతో మాట్లాడారు. కొద్ది రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో భూగర్భ జలాలు అడుగంటి మోటర్లు కాలిపోవడంతోపాటు బోరుబావుల మోటర్ల నుంచి నీరు సరిగ్గా పైకి రాకపోవడంతోనే సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు.ఇప్పటి వరకైతే విద్యుత్ సమస్యలు తమ దృష్టికి రాలేదని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని అధికారులు భరోసా ఇచ్చారు. ఏడీఈ వెంట ఏఈ పెంట్యా నాయక్, లైన్‌మెన్ రాజు, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీశైలం తదితరులు ఉన్నారు.

గిరిజన రైతులతో మాట్లాడుతున్న ఏడీఈ సుధాకర్

ప్రభుత్వ పాఠశాలలకు సైన్స్ ల్యాబ్‌లు

సిద్దిపేట, మార్చి 12: సిద్దిపేట నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.1.80 కోట్ల నిధులు మంజూరైనట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. నియోజకవర్గంలో 8 ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఒక్కోటి రూ. 13.50 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సిద్దిపేట రూరల్ మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల పుల్లూరు, చిన్నకోడూర్ మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలు విఠలాపూర్, మాచాపూర్, రామునిపట్ల గ్రామాల్లో, నంగునూర్ మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆంక్షపూర్, నారాయణరావుపేట మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల గుర్రాల గొంది, సిద్దిపేట పట్టణంలో ప్రభుత్వ హైస్కూల్ నాసర్‌పురా ఉర్దూ మీడియం, ప్రభుత్వ న్యూ హైస్కూల్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావు

డిగ్రీ కళాశాలలో వసతుల కల్పనకు కృషి

ఎల్లమ్మ చెరువు సుందరీకరణకు అంచనాలు పంపండి
సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్, మార్చి 12: హుస్నాబాద్ పట్టణంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, కళాశాలను త్వరలోనే కొత్త భవనంలోకి మార్చాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు ఎల్ల మ్మ చెరువు కట్టను ఆయన పరిశీలించారు. అనంతరం హన్మకొండ రోడ్డులో మెడికల్ కళాశాల కోసం ప్రతిపాదించిన 30ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త భవనంలోకి మారడానికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎల్కతుర్తి, తాగునీరుతో పాటు ఇతర సౌకర్యాల వివరాలు పంపాలని ప్రిన్సిపాల్ భిక్షపతిని ఆదేశించారు. కళాశాల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన భవనాన్ని సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణ పనులు పూర్తయినందున వెంటనే కళాశాల నిర్వహణ ఇక్కడికి మార్చాలన్నారు. ఎల్లమ్మ చెరువు విస్తీర్ణం, ఆయకట్టు వివరాలను నీటిపారుదల శాఖ ఈఈ రాములునాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. సుందరీకరణ పనులు నిలిచిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చేయాల్సిన పనులు, కావాల్సిన నిధులను అంచనా వేసి పంపాలని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ విద్యాసాగర్‌ను ఆదేశించారు. మెడికల్ కళాశాల కోసం ప్రతిపాదించిన స్థలం వివరాలను సత్వరంగా పంపాలన్నారు. కలెక్టర్ వెంట ఇంజినీరింగ్ అధికారులతో పాటు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు కట్టను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ఇద్దరు రైతుల ఆత్మహత్య

ఇప్పంకింది కలమ్మ(ఫైల్)

చేగుంట, మార్చి 12: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళా కూలీ ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం బీంరావ్‌పల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. నార్సింగి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బీంరావ్‌పల్లి గ్రామానికి చెందిన ఇప్పంకింది కలమ్మ(40), భర్త రాములు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కొద్ది పాటి భూమి ఉండగా బోరు నుంచి నీళ్లు రాకపోవడంతో వేసిన పంట ఎండిపోయింది. అప్పటినుంచి కూలి పనులకు వెళ్తున్నారు. చిట్టి డబ్బులు కట్టే విషయమై రాత్రి మాట్లాడుకున్నారు. రోజులాగే తిని పడుకున్నారు. ఉదయం లేచి చూసే సరికి తన భార్య ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నదని రాములు తెలిపాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి భర్త రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం ఎవరి దక్కేనో..?

- మార్కెట్ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు
- ఖరారైన రిజర్వేషన్లు
- త్వరలో కొత్త పాలకవర్గాలు
- ప్రయత్నాలు చేస్తున్న అధికార పార్టీ నేతలు

మెదక్, మార్చి 12(నమస్తే తెలంగాణ): వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలక వర్గాలను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వ్యవసాయ మార్కెట్లకు త్వరలోనే పాలక వర్గాలను ప్రకటిస్తామని ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లను ప్రకటించింది. మెదక్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు త్వరలో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీ సభ్యులను ప్రభుత్వం నియమించనున్నది. మెదక్ మార్కెట్ చైర్మన్ పదవిని బీసీకి కేటాయించగా, చేగుంట ఓసీ, రామాయంపేట ఎస్టీ, పాపన్నపేట ఎస్సీ, నర్సాపూర్ బీసీలకు కేటాయించింది. తూప్రాన్ మార్కెట్ కమిటీ రిజర్వేషన్ ఇంకా ఖరారు కాలేదు. దీంతో పాలకవర్గాలకు సారథ్యం వహించే చైర్మన్ పదవుల కోసం అధికార పార్టీలో పోటీ నెలకొన్నది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రసన్నం చేసుకుంటున్నారు.

ఎవరికీ వారే ప్రయత్నాలు

మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం కాంగ్రెస్ నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రంలోని మార్కెట్ కమిటీలకు ఒక్కొక్కటిగా పాలక వర్గాలను నియమిస్తుండడంతో ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రస్తుతం మెదక్ జిల్లాలో మెదక్ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కాగా, నర్సాపూర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మెదక్ జిల్లాలో అన్ని మార్కెట్ కమిటీలు రెండుసార్లు చైర్మన్ పదవీకాలం పూర్తి చేశారు. ప్రస్తుతం మూడోసారి పదవీ కాలం ప్రారంభంకానున్నది. రెండు పర్యాయాలు బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు మార్కెట్ కమిటీ పదవుల్లో కొనసాగారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం పాలకవర్గాలకు ఎవరికీ ప్రాధాన్యత ఇవ్వనున్నదో వేచిచూద్దాం.

వీరే అర్హులు

మార్కెట్ కమిటీ పరిధిలోని సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తిదారులు, పశుగణం, పశుగణ ఉత్పత్తిదారులు అర్హులు. వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, మహిళలై ఉండాలి. కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు ఉండాలి. ఇక నలుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా మార్కెట్ పరిధిలోని పీఏసీఎస్, సహకార మార్కెటింగ్ సంఘాల నుంచి ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఒకరు, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్యశాఖ అధికారుల్లో ఒక సభ్యుడు, మార్కెట్ కమిటీ పరిధిలోని మేయర్, మున్సిపల్ చైర్మన్ లేదా గ్రామ సర్పంచుల్లో ఒకరు ఉంటారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌ను 12 మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ చైర్మన్‌ను లైసెన్స్ ట్రేడర్స్ సభ్యుల నుంచి లేదా రైతు సభ్యుల నుంచి నియమించవచ్చు.

అక్రమ ఇసుక ఫిల్టర్లపై దాడులు

సంగారెడ్డి, మార్చి12: కృత్రిమ ఇసుక తయారీ కేంద్రంపై టాస్కఫోర్స్ పోలీసుల దాడులు చేసి అక్రమ ఫిల్టర్లను ధ్వంసం చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట నక్కవాగులో ఒక ఇటాచీ, రెండు ట్రాక్టర్లతో మట్టిని తవ్వి ఇసుక తయారు చేస్తున్న నిర్వాహకుడు వెండికోల్ వీరేశం, మరో నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. అక్రమ ఇసుక తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సీ రూపేశ్ వెల్లడించారు.

ట్రాక్టర్‌తో మట్టిని కడిగి ఇసుక తయారు చేస్తున్న అక్రమార్కులు

ఎన్నికలు కట్టుదిట్టంగా నిర్వహించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 12: వచ్చే పార్లమెంట్ ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై హైదరాబాద్ నుంచి ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే జిల్లాలో ఎన్నికల నియమావళిని అమలుచేయాలని, అందుకు అవసరమయ్యే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. నామినేషన్ దాఖలు ఏర్పాట్లు పక్కాగా చేసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌లపై పూర్తిస్థాయి కంట్రోల్ ఉండాలని, ఎన్నికల నిర్వహణపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలను నిరంతరం పరిశీలించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఓట రు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, జిల్లాలో ప్రముఖులతో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన వీడియోలు రూపొందించాలన్నారు. 18 నుంచి 19 ఏండ్ల వయస్సు గల నూతన ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో వచ్చే మార్పులపై ఎప్పకప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలన్నారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్డీవో పద్మజారాణి, ఆర్డీవోలు పాండు, రాజు, వసంతకుమారి పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

మనోహర్

టేక్మాల్, మార్చి 12: మండల పరిధిలోని ధనూర గ్రామానికి చెందిన ఒక విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ధనూర గ్రామానికి చెందిన బందరుగల్ల అనిత, కుమార్‌ల కుమారుడు మనోహర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. రెండు నెలల క్రితం మనోహర్ పాఠశాలలో అల్లరి చేస్తున్నాడని అదే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు చంద్రప్రకాశ్ మనోహర్‌ని కర్రతో కొట్టగా అది కాలు నరానికి బలంగా తగిలింది. దీంతో మనోహర్ సరిగా సడవలేని స్థితిలో ఉండడంతో బాలుడి తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని నిలదీశారు. బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం ఉపాధ్యాయుడు రూ.10 వేలు ఇచ్చాడు. బాలుడి గాయం తీవ్రం కావడంతో ప్రస్తుతం నడువలేని స్థితిలో ఉన్నాడు. మనోహర్‌కు రెండు నెలలుగా సుమారు రూ.8 లక్షల వరకు ఖర్చు అయ్యాయని, వైద్య ఖర్చులు చెల్లిస్తామని చెప్పిన ఉపాధ్యాయుడు ప్రస్తుతం ఎలాంటి వైద్య ఖర్చులు భరించకపోవడంతో బాలుడి తల్లిదండ్రులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దయానంద్ తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

కిష్టాపూర్‌లో అప్పుల బాధతో..

కుర్మ స్వామి(ఫైల్)

చేగుంట, మార్చి 12: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం కిష్టాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. బాధత కుటుంబ సభ్యులు, చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) తనకున్న భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయానికి చేసిన అప్పులు, కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపానికి గురై తన పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు.